క్లుప్తంగా

నేడు ఆత్మీయ కృతజ్ఞత సభ

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలంలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారధులు, వలంటీర్లకు గురువారం ఉదయం 9గంటలకు కడప నగర సమీపంలోని ఫాతిమా కళాశాల వద్ద ఉన్న మహాలక్ష్మి కల్యాణ మండపంలో ఆత్మీయ కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెండ్లిమర్రి మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకే దిన్నె జెడ్పీటీసీ పి.నరేష్ రామాంజులరెడ్డిలు హాజరవుతారన్నారు.

నేడు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి రాక

చక్రాయపేట : మండలంలోని కల్లూరుపల్లె గ్రామానికి గురువారం ఉదయం 6.30 గంటలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పులివెందుల ఓఎస్‌డీ అనిల్‌కుమార్ రెడ్డి, మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డిలు రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల సమన్వయకర్త ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కల్లూరుపల్లెలో సచివాలయ భవనాన్ని ప్రారంభించి అనంతరం జరిగే ప్రజాదర్బార్‌లో ఎంపీ పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు, పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులకు అన్నదానం



ఛాత్రాలయంలో విద్యార్థులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

కమలాపురం : కమలాపురంలోని ఛాత్రాలయంలో విద్యార్థులకు నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. పట్టణానికి చెందిన శీలం సుబ్బమ్మ, శీలం శేషయ్యల జ్ఞాపకార్థం వారి కుమారుడు శీలం నాగరాజు కుటుంబ సభ్యులతో కలిసి ఛాత్రాలయంలోని విద్యార్థులకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న లయోలా డిగ్రీ కళాశాల విద్యార్థులు

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అమలఆరోక్యరాజ్ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని లయోలా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి శంకరయ్య, గంగాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

వలీ కుటుంబానికి ఆర్థిక సాయం



వలీ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నూర్‌బాషా సంఘం ప్రతినిధులు

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని అచ్చివెళ్లి గ్రామ సమీపంలో ఉన్న ఉప్పరాంపల్లె గ్రామానికి చెందిన దంపతులు వలీ, రమీజాలు నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న నూరుబాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ పులివెందుల తాలుకా అధ్యక్షుడు ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో సంఘం తరుపున లక్ష రూపాయలు వలీ కుటుంబ సభ్యులకు బుధవారం అందచేశారు. అలాగే పులివెందుల పట్టణానికి చెందిన టైలర్స్ సంఘం అధ్యక్షుడు బాదుల్లా ఆధ్వర్యంలో సంఘం తరుపున రూ.16 వేలను అందజేశారు. కార్యక్రమంలో సంపత్,భారా,షరీఫ్,అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కడప కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పలుచోట్ల అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్‌లోని అర్బన్ బాలుర హాస్టల్, జిల్లా పరిషత్ ఆవరణలోని నిరాశ్రయుల వసతి గృహంలో ఏర్పాటు చేశారు. అలాగే పాత బస్టాండులోని సంస్థ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బ్రహ్మయ్య పర్యవేక్షణలో 500 మందికి అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు గౌరీ శంకర్ పాల్గొన్నారు.

కృష్ణం వందే జగద్గురుమ్

- ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- శ్రీకృష్ణ ఆలయంలో విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణ భగవానుడు



శ్రీకృష్ణుడి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

పులివెందుల టౌన్ : శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని బుధవారం ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుని ఆలయంలో విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరాలు సమర్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందుకున్నారు. శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుని, గోపికల వేషధారణలో ప్రత్యేకంగా కనువిందు చేశారు. పాఠశాలల్లో, పురవీధులలో, ఆలయాలలో ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక బిడాలమిట్ట వీధిలోని వికాస్ స్కూల్, రాఘవేంద్ర ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించినట్లు కరస్పాండెంట్ షేక్ రఫియా తెలిపారు. బుధవారం పాఠశాల ఆవరణలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కృష్ణుడు, గోపికల వేషధారణలు అందరిని అలరించాయి. కరస్పాండెంట్ మాట్లాడుతూ పండుగలు సాంప్రదాయాలకు ప్రతీకలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు నజీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వీరపునాయునిపల్లె మండలంలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లె శ్రీ శివకృష్ణ గోశాలలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు గోశాల నిర్వాహకుడు కల్లూరు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9గంటలకు గోపూజ ఆ తర్వాత క్రిష్టాలయంలో భగవద్గీత పారాయణం, భజన కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం 11 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచి ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ వేడుకల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అడవిచెర్లోపల్లెలో..

మండలంలోని మారుమూల గ్రామమైన అడవిచెర్లోపల్లె సమీపంలో కొండపై వెలసిన వేణుగోపాల స్వామి ఆలయంలో క్రిష్టాష్టమి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆలయ నిర్వాహకుడు గండి ఓబన్న తెలిపారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. బుధవారం పెద్ద పసుపుల రహదారిలో ఉన్న మునిరెడ్డి కాంప్లెక్స్ ప్రాంగణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. అలాగే పట్టణంలోని వివిధ పాఠశాలలతో పాటు వీధుల్లో పిల్లలకు ఆటల పోటీలను, శ్రీకృష్ణుడి వేషధారణ కార్యక్రమాలను నిర్వహించారు.



కృష్ణుడు గోపికల వేషధారణలో ఉన్న విద్యార్థులతో కరస్పాండెంట్

రేపు సీతారాంపల్లె గంగమ్మ తల్లి ప్రథమ వార్షికోత్సవం

వేంపల్లె : చక్రాయపేట మండలంలోని సీతారాంపల్లె గ్రామంలో 8వతేదీ శుక్రవారం గంగమ్మ తల్లి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు సీతారాంపల్లె గ్రామ ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా గణపతి పూజ, విశేష అభిషేకం, అలంకారం, తదితర పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు గంగమ్మ తల్లిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.



గంగమ్మ తల్లి

సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు తగదు

పులివెందుల టౌన్ : సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని బీజేపీ నాయకుడు శశిభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక శ్రీవెంకటేశ్వర ఆలయం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కించపరుస్తూ ఎవరు మాట్లాడినా సహించేదిలేదని హిందూ ఐక్యవేదిక సభ్యులు పేర్కొన్నారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విద్యాధరి భానుప్రకాష్, చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చంద్రమహేష్, శ్రీను పాల్గొన్నారు.

రేపు నగరంలో నిరసన ర్యాలీ

కడప కల్చరల్ : తమిళనాడుకు చెందిన రాజకీయవేత్త ఉదయనిధి స్టాలిన్ భారతీయ సనాతన ధర్మానికి వ్యతిరేఖంగా చేసి వ్యాఖ్యలకు నిరసనగా విశ్వహిందూ పరిషత్, హిందూ చైతన్య వేదికలు నిరసన ర్యాలీలు చేపట్టనున్నట్లు సంస్థల ప్రతినిధులు బెస్తవేముల రామమహేష్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఆర్టీసీ బస్టాండు వద్దగల అంబేద్కర్ సర్కిల్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ర్యాలీ కలెక్టరేట్‌కు చేరుకున్న తర్వాత సంస్థల ప్రతినిధులు తమ నిరసనను తెలిపే వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

ఆరోగ్యమాత ఆశీస్సులు పొందుదాం

కడప కల్చరల్ : నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం నవదిన ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు బుధవారం పోరుమామిళ్ల డీస్ విచారణ గురువులు రెవ ఫాదర్ జాల విజయభాస్కర్ దివ్యబలి పూజను సమర్పించగా, మరియతల్లి సందేశాన్ని బి.కోడూరు విచారణ గురువులు రెవ ఫాదర్ అరుణ్‌కుమార్ అందించారు. గురువులు మాట్లాడుతూ ఎనిమిది రోజుల పాటు ఈ క్షేత్రంలో ఆరోగ్య మాత ఉత్సవాలు వైభవంగా నిర్వహించామన్నారు. ఆరోగ్య మాత స్వరూపాన్ని అలంకరించి పల్లకిలో క్షేత్ర ప్రాంగణంలో ప్రదక్షిణలు నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

కడప తాలూకా సీఐగా రాజా

కడప అర్బన్ : నగరంలోని తాలూకా అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా పి.రాజా బుధవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా అవుకుకు చెందిన ఆయన వ్యవసాయకుటుంబం నుంచి వచ్చారు. 2002 బ్యాచ్‌లో ఎస్ఐగా ఎంపికై మొదట అనంతపురం జిల్లా రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరారు. 2012లో సీఐగా పదోన్నతి పొందారు. సీఐగా కడప సీసీఎస్, అనంతపురం సీసీఎస్‌లో పనిచేశారు. అనంతపురం జిల్లా ధర్మవరం టూటౌన్ సీఐగా పనిచేస్తుండగా, కడప తాలూకా సీఐగా బదిలీపై వచ్చారు.

కరపత్రాలు విడుదల

కడప కోటిరెడ్డి సర్కిల్ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నుంచి దేశాన్ని కాపాడాలని రైల్వే గూడ్స్ షెడ్ హమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కేసి.బాదుల్లా, ఎస్.మహబూబ్‌బాషాలు బుధవారం యూనియన్ కార్యాలయంలో ఈనెల 8న సీపీఐ తలపెట్టిన బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సీపీఐ రాష్ట్ర, జాతీయ నాయకులు హాజరవుతారన్నారు.

గురువులందరికీ క్షమాపణ చెప్పాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులను కించపరిచేలా మాట్లాడిన పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తక్షణం ఉపాధ్యాయులకు క్షమాపణ చెప్పాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. గతంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆయన ఈ వాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. అలాగే యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆయన ఉపాధ్యాయ లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే గురువుల కన్నా గూగుల్ మిన్న అని మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడటం సరిగా లేదని ఏపీ ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. కడపలోని ఏపీ ఎస్టీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ మంత్రిగా కూడా పనిచేసిన మీరు గురువులను ఇలా తక్కువ చేసి మాట్లాడటం బాధాకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎస్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొరళి, జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



రహమతుల్లా, ప్రసాద్‌రెడ్డిలను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



హెడ్‌టీచర్ యాస్మిన్‌బేగంను సన్మానిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు ఎంపికైన పాతకడప జిల్లా పరిషత్తు హైస్కూల్‌కు చెందిన ఇంగ్లీష్ టీచర్ రహమతుల్లా, మ్యాథ్స్ టీచర్ ప్రసాద్‌రెడ్డిలను బుధవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విశ్వభారతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే 20వ వార్డులోని గాంధ్లస్ట్రీట్ నగరపాలక ప్రాథమిక పాఠశాల హెడ్ టీచర్ యాస్మన్‌బేగం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సందర్భంగా బుధవారం కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగమణి, పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

నిత్యావసరాలు అందజేత

సిద్దవటం : నిరుపేద కుటుంబానికి నిత్యావసర వస్తువులను బుధవారం అందజేసినట్టు మన ఊరి కోసం సేవా సంస్థ అధ్యక్షుడు రవిశంకర్ తెలిపారు. మండలం లోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని రామక్రిష్ణపురం గ్రామానికి చెందిన చల్లా గంగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. ఇటీవల ప్రమాదవశాత్తు కాలు విరగడంతో మంచానికే పరిమితమైంది. విషయం తెలుసుకున్న స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు కీ.శే. డాక్టర్ మందూరు రామయ్య వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుటుంబ సభ్యులు రెండు నెలల సరిపడా నిత్యావసర వస్తువులతోపాటు రూ.వెయ్యి నగదును అందజేశామని సంస్థ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రామక్రిష్ణ, సుధీర్, సామల చెంగయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలను అందజేస్తున్న రవిశంకర్

పేదల ఇళ్లను తొలగించవద్దు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగర శివార్లలోని భగత్‌సింగ్ నగర్‌లో పేదల ఇళ్లను తొలగించరాదని సీపీఎం నగర కమిటీ సభ్యులు పి.చంద్రారెడ్డి, డి.ఎం.ఓబులేసు కోరారు. బుధవారం 45వ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో పేదల ఇళ్లను అధి కారులు తొలగించడాన్ని సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. 20 సంవత్సరాలుగా నివాసం ఉన్న పేదల ఇళ్లను తొలగించాలని అధికారులు ఆదేశాలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. కరెంటు బిల్లులు చెల్లిస్తూ, ఇంటి పన్ను కడుతూ, అనుబంధ పత్రాలు పొంది ఉన్నారన్నారు. ఊటుకూరు చెరువు అభివృద్ధి పేరుతో ఇళ్లను తొలగించాలనే ప్రయత్నాన్ని ప్రభుత్వం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

చేతి వృత్తుల కళాకారులు

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

జమ్మలమడుగు : చేతి వృత్తుల కళాకారులు కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాని హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బడిగించల చంద్రమౌళి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని రామిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న విజ్ఞాన్ పాఠశాలలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ పథకం ద్వారా సుమారు 30శాతం హస్త కళాకారులకు, చేతి వృత్తిదారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ పథకం కింద శిక్షణ ఇవ్వడంతోపాటు లక్ష రూపాయల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తారన్నారు. శిక్షణ సమయంలో రోజుకు 500 రూపాయలు, ఉచిత భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన కళాకారులు సమీపంలోని వార్డు, గ్రామ సచివాలయాలలో ఉన్న కామన్ సర్వీసు సెంటర్‌లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు వేములలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం

వేముల : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈనెల 8న మండల కేంద్రమైన వేములలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయరామరాజుతో పాటు జిల్లా స్థాయి అధికారులందరు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ సమస్యలను కలెక్టరు దృష్టికి తీసుకెళ్లవచ్చన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను అక్కడే ఆన్‌లైన్ చేసి అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కలెక్టర్ విజయరామరాజు వేములలో అందుబాటులో ఉంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న మెప్మా అధికారి గంగులయ్య

పులివెందుల రూరల్ : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మెప్మా అధికారి గంగులయ్య అన్నారు. బుధవారం పాతబస్టాండు సమీపంలో ఉన్న మెప్మా కార్యాలయంలో పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న సంఘాలు బలోపేతం అయ్యే విధంగా ఆర్పీలు వారికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశాల నిర్వహణ, లీడర్ల బాధ్యతలు, పుస్తకాలు వ్రాయడం వల్ల ఉపయోగాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా జగనన్న మహిళా మార్టులో నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తూ మార్టు అభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పడాలన్నారు. జగనన్నతోడు, పీఎం స్వనిధి, చిరువ్యాపారులకు రూ.10వేలు, రెండవ విడత రూ.20వేలు, మూడవ విడత రూ.50వేలు తీసుకుని వ్యాపారాలను అభివృద్ధి పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఓ నాయుడు, ఆర్పీ లక్ష్మి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఐటీ నోటీసులపై చంద్రబాబు నోరు విప్పాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్ : ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులపై టీడీపీ నేత చంద్రబాబు నోరు విప్పాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రతి అంశంలోనూ వేల కోట్లు కమీషన్లు తీసుకున్నారని, ఆ పార్టీ నేతలు కూడా దోచుకోవడం, దాచుకోవడమే పనిగా చేసుకున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో బాబు రూ.118 కోట్లు కమీషన్లుగా తీసుకున్నారని ఐటీ శాఖ రుజువులతో సహా బయటపెట్టిందన్నారు. దీనిపై వివరణ ఇవ్వాల్సిన చంద్రబాబు తేలు కుట్టిన దొంగలా నోరు మెదపడం లేదని విమర్శించారు. బాబు అక్రమార్జనలో ఇదొక భాగం మాత్రమేనని, ఇలాంటి ఎన్నో స్కాములు ఆయన చేశారని తెహల్కా డాట్ కాం ఎప్పుడో బయటపెట్టిందని గుర్తు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో తండ్రీ తనయులు చేసిన అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రహస్య కోడ్‌లు ఉపయోగించి వందల కోట్ల ప్రజాధనాన్ని వీరు లూటీ చేశారన్నారు. చంద్రబాబు జీవితమంతా ఆర్థిక నేరాలు, కుట్రలు, కుతంత్రాలతోనే సాగిందని, ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నిత్య, ఫయాజ్ పాల్గొన్నారు.

రేపటినుంచి విగ్రహప్రతిష్ట వేడుకలు



నూతన దేవస్థానం

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ రెడ్డినగర్‌లో నిర్మించిన నూతన దేవస్థానంలో నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వరసిద్ధి వినాయక, శ్రీకోదండరామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని సర్పంచ్ చిత్తా రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం విశ్వక్సేన ఆరాధన, మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణము, జలాధివాసం ఉంటుందన్నారు. శనివారం మహాకుంభ స్థాపన, మూలవిరాట్ల గ్రామోత్సవంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. ఆదివారం శిఖర, కలశ, ధ్వజస్తంభ, నాగుల ప్రతిష్ఠ కార్యక్రమాలు, శ్రీ సీతారామ తిరు కల్యాణం, అనంతరం అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

పావని లక్ష్యసాధన స్ఫూర్తిదాయకం



పావనిని అభినందిస్తున్న జీవీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జీవీ రమణ

మైదుకూరు : మైదుకూరుకు చెందిన భూమి రెడ్డి పావని డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యేందుకు చేసిన లక్ష్యసాధన స్ఫూర్తిదాయకమని పులివెందులకు చెందిన జీవీ ఆర్ ఫౌండేషన్, జీవీఆర్ ఉచిత బలిజ మ్యాట్రిమోని వ్యవస్థాపకులు జీవీ రమణ అన్నారు. బుధవారం ఆయన ఇటీవల గ్రూప్-1 పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన భూమిరెడ్డి పావనిని ఆమె స్వగృహంలో కలిసి అభినందించారు. పావని గ్రూప్-1 పరీక్షల సన్నద్ధమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తన కుమార్తె ఉన్నత లక్ష్యానికి చేరుకునే విధంగా ప్రోత్సహించిన తల్లిదండ్రులు భూమిరెడ్డి గంగయ్య, లక్ష్మీదేవితోపాటు పావనిని శాలువా, పూలమాలతో సత్కరించారు. భవిష్యత్తులో ఆమె మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని జీవీ రమణ ఆకాంక్షించారు. పావనిని అభినందించిన వారిలో లక్ష్మయ్య, జి.రామకృష్ణ ఉన్నారు.

అంబరాన్నంటిన తీజ్ వేడుకలు



వెదురు బుట్టలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా వస్తున్న గిరిజన యువతులు



నృత్యం చేస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : బంజారా తీజ్ ఉత్సవాలు బుధవారం సాయంత్రం రాయచోటి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బంజారా తీజ్ ఉత్సవ కమిటీ, ఏపీ గిరిజన సమాఖ్యల ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలు జరిపారు. ఉత్సవాల్లో భాగంగా బంజారా యువతులు ఎస్‌యస్‌కాలనీలోని సాయిబాబా మందిరం నుంచి ఉపవాస దీక్షలతో బుట్టలలో మొలకెత్తిన గోదుమ బుట్టలను నెత్తిన పెట్టుకుని సాంప్రదాయ నృత్యాలు నడుమ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథనాయక్ మాట్లాడుతూ అఖండ భారతావనిలో వందల ఏళ్ల నుంచే బంజారాల పండుగలు ప్రత్యేకతను కలిగి ఉన్నాయన్నారు. యువతులు తమకు మంచి వరుడు కావాలని దైవాన్ని కోరుకుంటూ భక్తిశ్రద్ధలతో తీజ్ ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు.గిరిజన యువతులు యువతులు 9 రోజుల పాటు అత్యంత నిష్ఠగా ఉపవాసాలు ఉంటారన్నారు. పండుగలో భాగంగా మొదటగా పుట్టమట్టిని తీసుకవచ్చి వెదురుబుట్టలో వేసి అందులో గోదుమలు పోసి మొలకలు పెంచుతారన్నారు. బుట్టల్లో మొలకలు ఎంత పచ్చగా ఉంటే భవిష్యత్‌లో అంత ఆయురారోగ్యాలు, సంతోషాలు కలుగుతాయని గిరిజన యువతుల నమ్మకం అన్నారు. 9వ రోజున మొలకలున్న బుట్టలను సాంప్రదాయరీతిలో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేస్తారన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు, గిరిజన యువతులు పాల్గొన్నారు.